సేవ తడబడి.. కేంద్రం మూతపడి

రైతులకు సేవలందించాలనే సత్సంకల్పంతో ఏర్పాటు చేసిన రైతు సేవా కేంద్రం రోజుల తరబడి మూతపడి ఉంది. ఆ ప్రాంత రైతులు తరచూ కార్యాలయానికి వచ్చి వెనుదిరిగి వెళ్లాల్సిన పరిస్థితి.

- రైతులకు ఉపయోగపడని కేంద్రం
- రోజూ పడిగాపులు కాస్తున్న రైతులు


గోపవరం రైతు సేవా కేంద్రం వద్ద రైతులు

గోపవరం : గోపవరం రైతు సేవా కేంద్రానికి ఏఈఓను ఇన్‌చార్జిగా నియమించారు. తరచూ అయన కార్యాలయానికి రాకపోవడంతో రైతులు ఇబ్బందిపడుతున్నారు. విధుల్లో ఉన్నారా? సెలవుపై వెళ్లారా? అనే విషయాలపైనా రైతులకు సమాచారం లేదు. మండలానికి రెగ్యులర్ ఏవో లేక సేవా కేంద్రాల ఆలనాపాలనా కొరవడింది. నియమించిన సిబ్బంది అధికంగా ఇన్‌చార్జి బాధ్యతలే నిర్వహిస్తున్నారు. వారు కార్యాలయానికి ఎప్పుడు వస్తారో? ఎప్పుడు వెళతారో? తెలియదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ సమస్యలు పట్టించుకునే నాథులే లేరని ఆందోళన చెందుతున్నారు.

రైతుల పడిగాపులు

గోపవరం రైతు సేవా కేంద్రానికి గోపవరం, భూమిరెడ్డిపల్లె, శ్రీనివాసపురం, మడకలవారిపల్లె, ఎస్‌హెచ్‌ఓ రామాపురం నుండి రైతులు తమ అవసరాల నిమిత్తం వస్తుంటారు. ఎప్పుడు వచ్చినా తాళం వేసి ఉండడ, సమాచారం లేకపోవడంతో మధ్యాహ్నం వరకూ పడిగాపులు కాసి వెనుదిరుగుతున్నారు. కార్యాలయం మూతపడిన విషయాన్ని అనేకమార్లు రైతులు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా చర్యలు తీసుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సెలవుపై వెళ్లినప్పుడు మరొకరినైనా నియమించాలని, అలాకాకుండా రోజుల తరబడి మూత వేయడం ఎంత వరకు సబబు అని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం రైతుల రిజిస్ట్రేషన్ కార్యక్రమం జరుగుతున్నందున పలువురు కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. అధికారులు స్పందించి రెగ్యులర్ సిబ్బందిని నియమించి రైతుల ఇబ్బందులను తొలగించాల్సిన అవసరం ఉంది.

యోగ నరసింహుడికి ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో యోగనరసింహస్వామి, సుదర్శనస్వామి

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక వైఎంఆర్ కాలనీలోని సత్యనారాయణ స్వామి ఆలయంలో సుదర్శన యోగ నరసింహస్వామికి మంగళవారం ప్రత్యేక పూజలు జరిపారు. స్వామి జన్మనక్షత్రమైన స్వాతి నక్షత్రం రోజున స్వామికి విశేష అభిషేకం, అర్చన చేసి ప్రత్యేకంగా అలంకరించారు. ఈ ఆలయంలో ఒకే రాతిపై ఒక వైపు యోగ ముద్రలో నరసింహ స్వామి, మరో వైపు సుదర్శన స్వామి ఉండడం విశేషం. భక్తులు పెద్ద ఎత్తున ఆలయానికి చేరుకుని స్వామికి కాయాకర్పూరం సమర్పించి భక్తి శ్రద్ధలతో పూజించారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలు అందచేశారు.

వాలంటరీ వ్యవస్థను పునరుద్ధరించాలి


మాట్లాడుతున్న నాయకులు

బద్వేలు అర్బన్ : ఎన్నికల సమయంలో కూటమి నేతలు ఇచ్చిన హామీ ప్రకారం వాలంటరీ వ్యవస్థను పునరుద్ధరించి ఉద్యోగ భద్రత కల్పించాలని ఏపీ గ్రామ, వార్డు వలంటీర్స్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి కె.నాగేంద్రబాబులు పేర్కొన్నారు. వారు మాట్లాడుతూ వలంటరీ వ్యవస్థపై మంత్రి డోలావీరాంజనేయస్వామి చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని కోరారు. ఎన్నికల సమయంలో వలంటీర్లను తొలగించబోమని, రూ.10 వేలు గౌరవ వేతనం ఇస్తామని హామీ ఇచ్చి ఇప్పటికి పది నెలలు కావస్తున్నా ఆ హామీని పట్టించుకోకపోవడం దారుణమన్నారు. అసెంబ్లీ సమావేశాల్లో వలంటరీ వ్యవస్థను పునరుద్ధరిస్తారని ఆశతో ఎదురుచూస్తున్న వారిని నిరాశపరుస్తూ తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వలంటీర్లు విధుల్లో లేరని, విధుల్లో ఉంటే ఆలోచన చేసేదని చెప్పడం దారుణమన్నారు. ఈ సమావేశంలో డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఎం.చిన్ని, పట్టణ అధ్యక్షుడు మస్తాన్‌షరీఫ్, వలంటీర్స్ యూనియన్ పట్టణ నాయకులు షంషుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ రద్దుకు డిమాండ్


మాట్లాడుతున్న ఇమ్మానుయేల్

ప్రొద్దుటూరు : ఎస్సీ వర్గీకరణచట్టం అమలును రద్దు చేయాలని స్థానిక పాత బస్టాండ్ సమీపంలోని డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ విగ్రహానికి రాష్ట్ర మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు రామాజి ఇమ్మానుయేల్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్సీ వర్గీకరణను రద్దు చేయాలని నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ పేరుతో దళితులను విడదీయడం బాధాకరమని తెలిపారు. కూటమి ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ బిల్లును ఆమోదిస్తే దానిని ప్రజా సంఘాలందరూ వ్యతిరేకించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మాల మహానాడు రాష్ట్ర గౌరవాధ్యక్షుడు మురళీప్రసాద్, రాష్ట్ర సోషల్ మీడియా అధ్యక్షుడు ఆకుమల్ల ప్రణయ్‌కుమార్, రాష్ట్ర సమన్వయకర్త మేకల ఓబులేసు, అరుణ్‌కుమార్, సంగటి పుల్లయ్య, సాత్రి లక్ష్మయ్య, చంద్రబాబు, పందిటి మోహన్, నాగరాజు, నారాయణ, రామారావు, దళిత ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఆదరణ పథకాలకు దరఖాస్తుల స్వీకరణ

పోరుమామిళ్ల : ఆదరణ పథకం కింద ఈ నెల 20 నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు ఎంపీడీవో రమణారెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ 2024–25 ఆర్థిక సంవత్సరానికి ప్రభుత్వం కుల వృత్తుల వారికి సామగ్రి అందజేస్తుందన్నారు.నాయీ బ్రాహ్మణులు, కార్పెంటర్లు, మత్స్యకారులు, స్వర్ణకారులు, కమ్మరి, కుమ్మరి, వండ్రంగి, రజక, టైలరింగ్, శిల్పకారులు పలు రకాల సంప్రదాయ చేతివృత్తుల్లో ఉన్నవారు పేర్లు నమోదు చేసుకోవచ్చన్నారు. 20న ఉదయం 11 గంటలకు ఎంపీడీఓ కార్యాలయంలో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

వన్య ప్రాణుల కేసుల నమోదుపై అవగాహన


చట్టాలపై అవగాహన కల్పిస్తున్న ఏపీపీలు

పోరుమామిళ్ల : ఎర్రచందనం, వన్య ప్రాణుల అక్రమ తరలింపులో కేసుల నమోదుపై మంగళవారం స్థానికులు అవగాహన కల్పించారు. స్థానిక అటవీ కార్యాలయం ఆవరణలో రేంజర్ రఘునాథరెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ రాజంపేట, బద్వేల్ కోర్టుల ఏపీపీలు నిజాం జానీ, ఉమాదేవి పాల్గొని కొత్తగా అమల్లోకి వచ్చిన అమెండ్‌మెంట్ బిఎన్ఎస్ఎస్ చట్టాల గురించి అవగాహన కల్పించారు. కేసులు ఏ విధంగా పెట్టాలి? ఆధునిక పరిజ్ఞానంతో కేసుల పురోగతి ఎలా సాధించాలి? చట్టాల గురించి ఈ సమావేశంలో అవగాహనతో పాటు శిక్షణ ఇచ్చారు. ఈసమావేశంలో రేంజి పరిధిలోని సెక్షన్ అధికారులు, బీటు అధికారులు పాల్గొన్నారు.

2011 లెక్కల ప్రకారం రిజర్వేషన్ల నివేదిక ఇవ్వడం దారుణం


మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు జేష్టాది భాస్కర్

ప్రొద్దుటూరు కల్చరల్ : ఎస్సీ రిజర్వేషన్ల విషయంలో మాలలకు న్యాయం చేయాలని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు జేష్టాది భాస్కర్ తెలిపారు. స్థానిక పాత బస్టాండు సమీపంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద మాల మహానాడు ఆధ్వర్యంలో మంగళవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజీవ్ రంజన్ మిశ్రా కమిషన్ 2011 జనాభా లెక్కల ప్రకారం రాష్ట్ర ప్రభుత్వానికి ఎస్సీ రిజర్వేషన్లపై నివేదిక ఇవ్వడం దుర్మార్గమైన చర్య అన్నారు. సీఎం క్షుణ్ణంగా పరిశీలించి మాలలకు న్యాయం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో మాలమహానాడు రాష్ట్ర కార్యదర్శి సాత్రి లక్ష్మయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షుడు గూడెం చెరువు సంపత్ కుమార్, పందిటి మోహన్, మేకల వెంకటన్న, శ్రీపతి భాస్కర్, మూటకట్ల ఆశీర్వాదం, పవన్, శేఖర్, రాబర్ట్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అసంపూర్తి ఇళ్లకు ఆర్థికసాయం

మైదుకూరు : మండలంలో అసంపూర్తిగా ఉన్న ఇళ్లకు అదనపు సాయం అందివ్వ నున్నట్టు ఎంపీడీఓ కేవీ.శ్రీధర్‌నాయుడు, హౌసింగ్ ఏఈ రాజేష్ తెలిపారు. అసంపూర్తి ఇళ్లను పూర్తి చేసుకునేందుకు బీసీ, ఎస్సీ, ఎస్టీలకు ఈ ఆర్థిక సాయం అందిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. బీసీ, ఎస్సీలకు రూ.50 వేలు, ఎస్టీలకు రూ.75 వేల చొప్పున ఆర్థిక సాయం అందించనున్నట్లు వివరించారు. ఈ ఏడాది ఏప్రిల్ 20వ తేదీలోపు ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేసుకున్న వారికే ఈ ఆర్థిక సాయం అందుతుందన్నారు. మండలంలో 135 ఇళ్లు పునాది దశలో, 105 ఇళ్లు గోడల దశలో, 39 ఇళ్లు కాంక్రీట్ పని వరకు పూర్తి చేసినట్లు వివరించారు. ఈ అవకాశాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పంచాయతీ కార్యదర్శుల సంఘం అధ్యక్షుడిగా వెంకటయ్య

రాజుపాళెం : మండలంలోని పంచాయతీ కార్యదర్శుల సంఘం మండల అధ్యక్షుడిగా వెంకటయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు పంచాయతీ కార్యదర్శులు మంగళవారం తెలిపారు. సంఘం ప్రధాన కార్యదర్శిగా గణేశ్వరబాబు, ఉపాధ్యక్షులుగా శీలం నిరంజన్ రెడ్డి, కోశాధికారిగా నాగార్జున, జాయింట్ కార్యదర్శులుగా మహేష్, పవన్‌కుమార్, గౌర సలహాదారులుగా బాబు, ఫణీంద్ర, మునిరెడ్డి, చెంద్రాయుడు, మహిళా విభాగం ఉపాధ్యక్షురాలుగా రామాంజనేయమ్మ, కార్యనిర్వాహక సభ్యులుగా బాలదస్తగిరి రెడ్డి, నవీన్‌కుమార్, సతీష్, నెపోలియన్, కుశలవరెడ్డి, అంకాలయ్య, కపిరాజులను ఎన్నుకున్నారు.

మున్సిపల్ కమిషనర్‌కు వినతి


కమిషనర్ మల్లికార్జునకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ప్రొద్దుటూరు : తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏపీ మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయీస్ యూనియన్(సీఐటీయూ) నాయకులు మంగళవారం కమిషనర్ మల్లికార్జునను వారు కలిసి వినతి పత్రం అందజేశారు. సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ ఎండలు ఎక్కువగా ఉన్నందున కార్మికులందరికీ క్యాప్, తాగడానికి వాటర్ బాటిల్, గ్లౌజులు ఇవ్వాలని తెలిపారు. ఇంజనీరింగ్ సెక్షన్ కార్మికులకు యూనిఫాం, పనిముట్లు, కరోనా కార్మికులను రెన్యువల్ చేయాలని కోరారు. మార్కెట్‌లో పనిచేస్తున్న ముగ్గురికి ఏడు నెలల వేతనాలు ఇవ్వాలని, డస్ట్ బిన్లు కొత్తవి తెప్పించాలని, వెహికల్స్‌కు త్వరగా రిపేర్లు చేయించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ పట్టణ అధ్యక్షుడు చంటి, ప్రధాన కార్యదర్శి సాల్మన్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ విజయ్‌కుమార్, ఉపాధ్యక్షురాలు గుర్రమ్మ, బాలాజీ, గంగాధర్, వెంకటేష్, అశోక్, శివ తదితరులు పాల్గొన్నారు.

చీనీ తోటల్లో అంతర పంటలు లాభదాయకం


తిప్పనపల్లి రైతు సేవా కేంద్రంలో రికార్డులు పరిశీలిస్తున్న నాగరాజ

అట్లూరు : చీనీ తోటలలో అంతర పంటగా నువ్వులతోపాటు పశుగ్రాసం, జొన్న తదితర పంటలను సాగు చేసుకుని అధిక లాభాలు పొందవచ్చని బద్వేల్ ఏడీఏ ఎం.నాగరాజ అన్నారు. బద్వేల్ మండలం తిప్పనపల్లి, చింతలచెరువు రైతు సేవా కేంద్రాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు ఏఈఏ వ్యవసాయ రికార్డులను పరిశీలించి పీఎం కిసాన్, పంట నమోదు ప్రక్రియ అంశాలపై చర్చించారు. యాంత్రీకరణ పథకం కింద 50 శాతం రాయితీతోట రైతులకు ట్రాక్టరు ఆధారిత వ్యవసాయ పనిముట్లు, పైపులు, ఇతర ప్రభుత్వం అందిస్తుందన్నారు. ఆసక్తి గల రైతులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

పోక్సో చట్టంపై అవగాహన అవసరం

ఒంటిమిట్ట : పోక్సో చట్టంపై ప్రతి ఒక్కరికీ అవగాహన తప్పనిసరి అని కడప జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి ఎస్.బాబా ఫక్రుద్దీన్ అన్నారు. మంగళవారం మండలంలోని ఎంపీడీఓ కార్యాలయ సమావేశ భవనంలో పోక్సో చట్టంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నారులపై లైంగిక దాడులు, వేధింపులు, నేరాల నిరోధానికి 2012లో అప్పటి ప్రభుత్వం పోక్సో చట్టం తీసుకువచ్చిందన్నారు. ఈ చట్టం ద్వారా బాధితులకు రక్షణ, నేరస్తులను పట్టుకోవడమే కాక వారికి వేసే కఠినతరమైన శిక్షలను పొందుపరిచారన్నారు. బాధితులు తమ ఫిర్యాదులను నమోదు చేయడానికి జాతీయ బాలల హక్కుల రక్షణ కమిషన్ (ఎన్‌సీపీసీఆర్) అధికారిక పోర్టల్‌లో పోక్సో ఈ బాక్స్ బటన్ ఉందని దానిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. చైల్డ్ హెల్ప్‌లైన్ నెంబరు 1098, లీగల్ సర్వీసెస్ హెల్ప్ లైన్ నెంబరు 15100 తదితర అంశాలను వివరించారు.

స్వశక్తితో మహిళల ముందడుగు


లీడర్లకు శిక్షణ ఇస్తున్న మరియన్న

బి.కోడూరు : స్వయం సహాయక సంఘం సభ్యులు స్వశక్తితో ముందడుగు వేయాలని వెలుగు ఏరియా కోఆర్డినేటర్ ఎల్.మరియన్న తెలిపారు. మల్టీ పర్పస్ సోషియల్ సర్వీస్ సొసైటీ డైరెక్టర్ టి.బాలరాజు ఆధ్వర్యంలో మండలంలోని మున్నెల్లిలో స్వయం సహాయక సంఘాల గ్రూపు లీడర్లకు మంగళవారం మహిళా సాధికారతపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వయం సంఘాల మహిళలు ఖాళీ సమయాల్లో ఇంటివద్దే ఉండి సర్ఫ్, డిటర్జెంట్ లిక్విడ్, వామ్ వాటర్, ఫినాయిల్ వంటి వాటిని తయారు చేసుకుని ఇతరులకు విక్రయించడం ద్వారా ఆదాయం పొందవచ్చన్నారు. జె.గుర్రయ్య, భారతి, లీడర్లు పాల్గొన్నారు.

డ్రైవర్లు అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఏపీఎస్ ఆర్టీసీలో పనిచేస్తున్న డ్రైవర్లు నిరంతరం అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వర్తించాలని జిల్లా ప్రజా రవాణాధికారి పొలిమేర గోపాల్‌రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం ఆర్ఎం కార్యాలయ కాన్ఫరెన్స్ హాలులో ఫిర్యాదులు వచ్చిన, ర్యాష్ డ్రైవింగ్ చేస్తున్న డ్రైవర్లకు శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రైవర్ల పనితీరుపైన ఆర్టీసీ అభివృద్ధి ఆధారపడి ఉందన్నారు. ఆర్టీసీ సంస్థకు ప్రమాద రహిత సంస్థగా పేరు ఉందన్నారు. ప్రతి డ్రైవరు విధుల్లో ప్రశాంతయుత మనస్సులో ఉండాలని, సకాలంలో ప్రయాణీకులను గమ్యస్థానాలకు చేర్చాలని సూచించారు.

వేసవిలోనూ జలకళ

ఈ ఏడాది వర్షాలు అధికంగా కురవడంతో వేసవిలోనూ(ఇప్పటికి) కాలువల్లో నీరు నిలిచి జలకళ సంతరించుకుంది. ఖరీఫ్‌లో సాగైన మినుము, పెసర, వరి, మొక్కజొన్న, పత్తి తదితర పంటల నూర్పిళ్ల అనంతరం రెండో పంటగా నువ్వు, కొర్ర, సజ్జ, మొక్కజొన్న, వేరుశనగ, వరి తదితర పంటలను రైతులు సాగు చేశారు. కొంతమంది పత్తి పంట దున్నివేసి ఈ పంటలను సాగు చేశారు. ప్రస్తుతం కేసీ చాపాడు, కేసీ ప్రధాన కాలువలు, కుందూనదిలో నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. ఆ నీరు పంటలకు అందించడమే కాకుండా గొర్రెలు, మేకలు, పశువుల దప్పిక తీరుస్తున్నాయని పలువురు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. అలాగే అక్కడక్కడ కొంతమంది ఈత కొడుతూ చల్లదనం పొందుతున్నారు.

– రాజుపాళెం


కుందూనదిలో నీరు తాగుతున్న గొర్రెలు


కుందూనదిలో ప్రవహిస్తున్న నీరు


నిండు కుండగా కేసీ చాపాడు కాలువ

క్లుప్తంగా

వైభవంగా శ్రీవారి వసంతోత్సవం


బ్రహ్మోత్సవాల సందర్భంగా ఉత్సవ విగ్రహాలకు వసంతోత్సవం

బద్వేలు అర్బన్ : మండలంలోని అనంతరాజుపురం పంచాయతీ లక్ష్మీపాలెంలో వెలసిన ప్రసన్న వేంకటేశ్వరస్వామిలో మంగళవారం స్వామి వసంతోత్సవం అంతకు ముందు శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలను అలంకరించి పూజలు నిర్వహించి అనంతరం గ్రామోత్సవం నిర్వహించారు. రాత్రికి ధ్వజావరోహణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవదాయశాఖ ఈఓ రామలింగారెడ్డి, ఆలయ ప్రధాన అర్చకులు భరద్వాజ్, శ్రావణ్, ఉత్సవ కమిటీ సభ్యులు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

బాల కార్మికులను పనుల్లో చేర్పించరాదు


తనిఖీలు చేస్తున్న సహాయ కార్మిక శాఖ అధికారులు

రాజుపాళెం : మైనర్ తీరని 18 ఏళ్ల లోపు పిల్లలను పనుల్లో చేర్పించుకోరాదని ప్రొద్దుటూరు సహాయ కార్మిక శాఖ అధికారులు పావని, శశిధర్‌రెడ్డి అన్నారు. రాజుపాళెంలోని హోటళ్లు, కూల్ డ్రింక్ షాపులు, బేకరీలు, తదితర షాపుల్లో వారు మంగళవారం తనిఖీలు జరిపారు. వారు మాట్లాడుతూ పాన్ ఇండియా బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనలో భాగంగా తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు సుమిత్ర, లక్ష్మీదేవి, మహిళా పోలీసు నాగవేణి పాల్గొన్నారు.

ఆదరణ పథకానికి దరఖాస్తుల ఆహ్వానం

రాజుపాళెం : వెనుకబడిన తరగతుల్లో కుల వృత్తులు చేసే వారి నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు ఎంపీడీఓ వెంకటరమణారెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. నాయీబ్రాహ్మణ హెయిర్ డ్రెస్సింగ్, మ్యూజికల్స్ బాక్సు, కార్పెంటరీ, ఆర్ట్ వర్క్, చేపలు పట్టడం, జనరల్ పవర్ టూల్స్, స్వర్ణ కారులు, కుమ్మరి, పాల వ్యాపారం, రజకులు, శిల్పులు, టైలరింగ్, చేనేత, వడ్రంగి వంటి సంప్రదాయ వృత్తుల వారికి సామగ్రి అందిస్తామన్నారు. ఈ నెల 19న ఉదయం 11 గంటలకు ఎంపీడీఓ కార్యాలయంలో జరిగే సమావేశానికి దరఖాస్తుదారులు హాజరుకావాలన్నారు.

గృహనిర్మాణాలకు ఆర్థిక సాయం

చాపాడు : ఏప్రిల్ 20వ తేదీలోగా గృహ నిర్మాణాలను పూర్తి చేసుకునే వారికి ప్రభుత్వం అదనపు లబ్ధి చేకూర్చనుంచి హౌసింగ్ ఏఈ ప్రమోద్ కుమార్ తెలిపారు. 2019–24 మధ్య ఎస్సీ, ఎస్టీ, బీసీ లబ్ధిదారులకు అదనంగా ఆర్థిక సాయం చేయటం జరుగుతుందన్నారు. మండలంలో బీపీఎల్-20, పీబీ-5, బీఎల్-56, ఆర్ఎల్-33, ఆర్‌సీ-14 గృహాలు ఉన్నాయన్నారు. వీరిలో బీసీ, ఎస్సీలకు రూ.50వేలు, ఎస్టీలకు రూ.75 వేలు చొప్పున ప్రభుత్వం ఆర్థిక సాయం చేస్తుందన్నారు. ఈ నెల 20వ తేదీ లోగా ఇంటి నిర్మాణాలను పూర్తి చేసుకోవాలని మరిన్ని వివరాలకు హౌసింగ్ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

గోమాతలకు అంత్యక్రియలు


ఆవు మృతదేహం వద్ద పూజలు చేస్తున్న మహిళలు

పోరుమామిళ్ల : పట్టణంలోని బలిజకోట వీధిలో మంగళవారం రెండు ఆవులు అనారోగ్యంతో మృతిచెందాయి. సమాచారం తెలిసిన సర్పంచ్ సుధాకర్ అక్కడకు చేరుకుని వివరాలు తెలుసుకున్నారు. రెండు ఆవులకు అంతిమక్రియలు నిర్వహించేందుకు తగిన ఏర్పాట్లు చేశారు.